# అలక

ద్వివేదుల సోమనాథశాస్త్రి

పిల్లకి బారసాల బలవంతాన్ని జరిపించి కమలతో సహా వచ్చేశాడు చంద్రం. అది సవ్యంగా జరిగిపోతే ఏ బాధా లేకపోనుగాని, అందరూ నవ్వులాట కింద కట్టడంవల్ల వచ్చింది.

పిల్ల పుట్టిందగ్గర్నుండి వెంటనే బారసాల చెయ్యమని ఎన్నివిధాల చెప్పినా పదకొండోరోజున కాదు యిరవైఒకటో రోజున కాదు నెలకొకదినం తక్కువచేసికూడా మాంవగారు చేశారుకాదు, సరికదా సముజాయిషీ అయినా ఇవ్వలేదు. అందుచేతనే చంద్రం ఏం ఆలోచించుకున్నాడో గాని మరోవిధాన్నయితే లాభంలేదని మాంవగారూ అత్తగారూ ఏదో వూరువెళ్ళడం, పెళ్లాం ఒక్కర్తీ వుండడం చూసి ఒక మంచిరోజున వెళ్లి అప్పటి కప్పుడు పురోహితుణ్ణి పిలిపించి ముహూర్తం పెట్టించి, బాజా బజంత్రీలు పిలిపించి తంతు యధావిధిగా జరిపించి వెంటనే కమలని యింటికి తీసుకు వచ్చేశాడు. అందరూ ముక్కులమీద వ్రేళ్ళు వేసుకొని బుగ్గలు పొడుచుకున్నా ఖాతరు చెయ్యలేదు.

తనుచేసిన యీ పని అందరికీ విడ్డూరం అయినా తనకి అది తగినపని అని తోచింది. యీ మాంవగారితో ఎంత పొత్తుగా వుందామని అనుకున్నా ప్రతివిషయంలోనూ ఏదో ఒక దగ్గిర తనకి యిష్టం లేనటువంటిది చేస్తూనే వుంటాడు. అది అతడు బుద్ధిపూర్వకంగానే చేస్తున్నాడా? అని-అనిపించి చంద్రానికి కోపం వస్తుంది. యీ పని మంచిదే అని తనకి తోచిచేసినా మనసు మాత్రం మాటి మాటికీ తర్కిస్తూ కొట్టుకొంటోంది. అందుగురించి ఆలోచించక తప్పకండావుంది. ఇంత యిది అయినా కమల మాత్రం కించిత్తూ కోపంగాని అయిష్టత గాని కనపర్చలేదు. ఎప్పటిలాగేవుంది. ఇంటికి వచ్చేసినా యీ ఆలోచనే పట్టుకుంది. పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు ఆ సమయంలో—

“పిల్లని ఎత్తుకుని అలా కాస్త ఆడించండి పని తెమలడంలేదు”అంటూ గౌరిని చంద్రం చేతుల్లో పెట్టింది కమల.—చంద్రం తెల్లబోయాడు. అప్పటికప్పుడే మంచిబట్టలు వేసుకొని ఆఫీసుకు పోడానికి సిద్ధపడుతున్నాడు. కాని అదేమీ గమనించకండానే కమల గౌరిని అతడి చేతుల్లోవుంచి వెళ్ళిపోతూంది.

“బావుంది ఆఫీసుకి వేళ అయిపోతూంది నువ్వే తీసుకు ఆడించు తరవాత పని చూసుకుందూగాని” అని మామూలుగా అనేసి పిల్లని తిరిగి యిచ్చిబోయేడు.

ఆ జవాబు విని వెళ్లిపోతున్నదల్లా యిటు తిరిగి కిసుక్కుని నవ్వింది. చంద్రం వయిపు అదోలా చూసింది—

ఆ చూపులో అయిదేళ్ల నాటి వేడుకలన్నీ కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నాయి. ఆ నవ్వులో ఆనాటి అపురూపపు మాటలన్నీ బొటబొట రాలేయి. అప్పుడామె నిలబడ్డ వైఖరి...శోభనం గదిలో తలుపుదగ్గర నిలబడివున్నపుడు, చంద్రం దొంగతనం లేకండా తొలిసారి ధైర్యంగా చూసినట్టే వుంది. అలక పాన్పుమీద ఓరకంటితో చూసిన కమల యిప్పుడు తిరిగి అలాగే కనిపిస్తూవుంది.

ఇలా కమలవయిపు చూస్తూ వర్తమానం మరిచిపోయి వున్నాడు చంద్రం.

ఇంతలో వెచ్చవెచ్చగా చేతులకి, బట్టకిందా తగలగానే ప్రపంచంలో పడ్డాడు... గౌరి వుచ్చపోసింది......

ఆ అనవాయితీ తీరగానే గౌరిని తీసుకుందికని కమల చేతులు జాపింది. ఆ చేతులెందుకో గాని... మొదటిసారి చంద్రం పండుక్కి వాళ్లింటికి వెళ్లినపుడు ఎవరూ లేకండా చూసి ఆమె చేయ్యి అందుకున్నప్పుడులాగే ఒణుకుతున్నాయి.

కమల గౌరిని తీసుకుంటున్నపుడు చంద్రానికి ఆమె చేతులు తగిలేయి.

అప్పుడతని ఒళ్లు జల్లుమన్నదంటే ఆశ్చర్యం ఏముంది?

పరవాణ్ణం మొదటిమారు యిద్దరూకలిసి తిన్నపుడూ, గదిలో గంధం రాసినపుడూ, తలంబ్రాలుపోసినపుడూ, చిటికనవ్రేలుపట్టుకొని అగ్నిహోత్రం చుట్టూ తిరిగినపుడూ మంగళసూత్రం కట్టేప్పుడు కంఠం చుట్టూ చేయి తలిగినపుడూ, సూత్రం కట్టడానికి బరువయిన జడని మీదకు ఎత్తినపుడు, బిందెలో గొలుసుకోసం పందెంవేసి పోట్లాడుతూన్నపుడూ వున్నట్టే చంద్రానికి ఇప్పుడూవుంది.

అయితే గొలుసుపందెంలో అన్యాయంగా అతని చెయ్యిగిల్లి గొలుసు లాగేసుకుంది కమల. తేలుకుట్టినదొంగలా చంద్రం నోరుమూసుకు వూరుకునే సరికి “అబ్బే పెళ్ళాంతో చాలలేకపోయాడు!” అని అందరూ గోలపెట్టి చిన్నబుచ్చేరు. అయినా అప్పుడు కమల తీసుకుంటేనే చంద్రానికి సరదాగావుంది. అందేవిటో! అందుకే పెళ్లాం బెల్లమంటారు!

కమల గౌరిని తీసుగొని వారిద్దరికీ మధ్యనున్న వుయ్యాల్లో పడుకోబెట్టింది. చంద్రం వేపూ గౌరి వేపూ చూస్తూ కమల—

“నాకు నవ్వొస్తూంది” అంది.

“ఎందుకూ!” అన్నాడు చంద్రం.

“చెప్పుకోండి!”

“నామీద ఉచ్చబోసిందనా! ఆనందం!”

“ఓ మా గొప్ప! టీ తాగుతూ ఒలకబోసుకున్నపుడూ, బొమ్మలు వేసేటప్పుడు రంగుబ్రష్షులు చొక్కాతోనే తుడిచేసుకున్నపుడూ లేదు కామోసు యిప్పుడే వచ్చింది!” అవును ఆ సమయంలో అలాగే వుంటుంది. మరి మంచి పెచెస్ పెడుతూంటే వేళకి గుడ్డదొరకనప్పుడు ఏం చేయడం?”

“పోనీలెండి! అందుకోసం కాదు!”

“మరి దేనికి!”

“జ్ఞాపకంలేదూ! తెచ్చుకోండి?”

“ఎక్కడనుండి తెచ్చుకోవడం?”

“మీ పెళ్లినుండి!”

“నా పెళ్లినుంచా! నీ పెళ్లినుంచా? మన పెళ్లినుంచా!”

“ఎక్కడనుండి అయినా ఒకటే!”

అని ఆమె అన్న తక్షణం ఆమెని మంచం మీద కూర్చోబెట్టేడు చంద్రం.

“బావుంది యిదేంవిటీ వికారం? వేళాపాళా...”

“ఏం ‘నాగవల్లి’... తెచ్చుకున్నాను జ్ఞాపకం...”

“అయితే...”

“అప్పుడూ యిలాగే కూర్చున్నాం... యిలాగే ఉయ్యాల కట్టేరు.. కాని...అయిన మార్పు—చందనపు బొమ్మకి బదులు—గౌరి—వసంతానికి బదులు—వుచ్చ...”

ఇలా చంద్రం చెప్పగా కమల మారిపోయింది. ఏదో ముగ్ధత్వం ఆవరించింది. ముఖం ఎర్రగా వేసుగొని దూరంగా జరిగి వయ్యారంగా సారిపెళ్ళికూతురిలా తలవంచుకొని వింటూంది!

కొంతసేపు ఎవ్వరూ మాటాడలేదు, ఆ

# అలక

మధురస్మృతులు నెమరువేసుగుంటూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ అదో లోకం లోకిపోయివున్నారు, అంతలో గౌరి ఏడుపు మొదలెట్టేసరికి యిద్దరూ మేలుకున్నారు...

"అదుగో మీ నాన్న! ఎత్తుకోమని అడుగు" అంది కమల.

"నా పేరు చెబితే నేగాని దానికేం తెలుస్తుంది" అన్నాడు చంద్రం. "నీ పేరు బాగా తెలుసు నువ్వే తీసుకో!" అని కూడా అన్నాడు.

"నా పేరు మీరుచెప్పండి దానికింకా తెలీదు!" అంది.

"నువ్వే మొదట చెప్పు!"

"మీరు మొదట చెప్పండి!"

—అమ్మలక్కలెవ్వరూ అక్కడ లేకపోడంవల్ల ఆ ముచ్చట అట్టే సాగలేదు. ఇంతలో గౌరి ఏడుపు ఎక్కువ అయింది.

"కాస్సేపు ఆడిద్దురూ" అని యిదంతా మరిచేపోయి అనుకోకుండా అనేసింది. చంద్రానికి ఆశ్చర్యంవేసి.

"ఆఫీసుకు పోవాలి నువ్వే ఆడించు" అనేసేడు...

...మళ్లీ కమల పకపక నవ్వింది...

...చంద్రం కూడా ఎక్కువ నవ్వేడు...

*　　　*　　　*

లాంఛనాలూ, పిలుపులూ, మర్యాదలూ, తూచ. తప్పకుండా జరిపించి పిలవగా పిలవగా మురిపించి మురిపించి పండగనాటికి వచ్చేడు, అల్లుడు!.. ...అల్లుడెంత చికాకు కలిగిస్తున్నా 'గౌరి'ని చూసేసరికి అవన్నీ మరిచిపోతూ వుంటారు కమలా చంద్రం. కన్నపిల్లని ఏడాదికోసారయినా తీసుకవచ్చి ముద్దూ ముచ్చటా తీర్చుగోకపోతే ఉండబట్టుతుందా? ఎవరికయినా? అందుకనే అల్లుళ్లు ఎన్ని అలకలు అలిగినా బతిమాలుకొని అన్నిటికీ తగి తీసుకువస్తూంటారు. అల్లుడొచ్చి శాంతంగా వెళ్లేవరకూ మనశ్శాంతే వుండదు కొందరికి.

మొత్తంమీద వేడుకలన్నీ అయినాక కానుకలన్నీ యిచ్చేక అల్లుడు వెళ్లిపోయాడు. గౌరిమాత్రం వుంది. అప్పటికి తిరుపతికొండఎక్కి దిగినట్లయింది చంద్రానికి!

ఆ నాలుగు రోజులూ కమల పనుల్లోనే మునిగిపోయివుంది. చంద్రంతో మాట్లాడ్డానికయినా తీరిక అయిందికాదు. ఒకసారి మధ్యలో తనే చొరవచేసుకోబోతే—

"మతిపోతూందా ఏమిటి? మరీ చిన్నతనం చేష్టలూ మీరూను! ఎదురుగుండా అమ్మాయీ, అల్లుడూ వుంటూంటేను" అని కసిరేసింది!

అమ్మాయీ అల్లుడూ ఎవరూ లేని సమయంకోసం కనిపెడుతూవుండడం, ఎవరూ లేరని అప్పుడప్పుడు ఎదురుతూ కలుస్తూ పోతూండడం గమనిస్తున్న చంద్రానికి తన చిన్నతనం, తనూ కమలా వాళ్లయింటికి యిలాగే పండుగలకి వెళ్లినపుడు గడిపిన హాయి అయిన రోజులూ ఆ అనుభవాలూ అన్నీ జ్ఞాపకానికి తెచ్చుకొని ఆనందపడేవాడు...

మరి ఒకటి రెండురోజులు అల్లుడు వెళ్లిన తర్వాత పండుగకబుర్లతో గడిపేరు.

ఆ రోజు ఆఫీసులో వుండగా తన పేర వచ్చిన పార్సిలును ఆశ్చర్యంతో విప్పి చూడగా 'పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసేనా?' అని అనుమానించవలసివచ్చింది.

అందులోవున్న వస్తువలు చూడగానే చంద్రానికి కోపం, ఆశ్చర్యం, ఉడుకుమోతుతనం, అన్నీ కూడుకొని వచ్చేయి. అందులో తను అల్లుడికిచ్చిన సూటుబట్ట, ఒక వుత్తరం వున్నది—ఆ వుత్తరంలో—

"ఈ బట్టలు పొరపాటున నాకు తెలియకుండా వచ్చేసేయి, సర్దడంలో మీ అమ్మాయి పొరపాటు చేసివుంటుంది, యివి ఎవరివో తెలియక తిరిగిపంపేస్తున్నాను' అని వుంది.

అదిచదివి ఏంచేయాలో తోచక విసుక్కున్నాడు. కమల చెప్పియుసుంది కదా అని తను అల్లునితో ఏం అనలేదు! అదీ కాక అతగాడిని కూడా బజారుకు తీసుకు వెళ్లి కొన్నాడు. అటువంటప్పుడు ఎవరికోసం కొన్నట్టు? అతనికి కాక పోతే మరెవరికి ఆ సమయంలో కొంటాడు? బాగుంది వరస! యింకా మర్యాద చాలలేదా! యీలాగయితే ఎవడితరం? అని అప్పటికి అనుకొని యింటికొచ్చి పార్సిలు కమల చేతికిస్తూ:

"నువ్వు యీ బట్టలు అతనికే అని చెప్పలేదా?" అని అడిగాడు.

ఆ పార్సిలు చూసి చంద్రం అన్న మాటలు విని, ఆ వుత్తరం చదివి, జవాబు చెప్పడానికి బదులు కమల, పకపక నవ్వడం ఆరంభించింది.

అది చంద్రంకి ఏం అర్థంకాక పోగా చికాకు వేసింది.

"ఏ(వి)టిది? నవ్వటానెందుకు? అతగాడు ఏవుద్దేశ్యంతో తిరిగిపంపేడో ఏమయింది?". అని అడిగాడు...

"ఏమయింది? మీరు నేర్పిన విద్యయే.. అన్నట్టు...అతగాడు మీకు అల్లుడేగా... తక్కువేం......" అంది నవ్వుతూ మాటాడుతూ నవ్వుతూ — మాటాడుతూ.

"నవ్వి అయినా చెప్పు... చెప్పి అయినా నవ్వు"

"మరి పూర్తిగా నవ్వనీండి!"

"చాలు యింక చెప్పు!"

"తగిన పనే చేశాడు!"

"అంత వేళాకాళంగావుంది! దీనితో పూరుకుంటూడా? నలుగురితో నూ చెప్పదూ?"

"ఏం చెబుతే!..." మీరూ అందరితోనీ చెప్పలేదూ?"

"ఏమని, ఎప్పుడు?"

"జ్ఞాపకం తెచ్చుకోండి!"

"ఎక్కడనుండి తెచ్చుకోవడం!"

"మీ అత్తవారింటిలోనుండి!"

—ఆ ముక్కతో చంద్రం స్థితి మారిపోయింది! అవును! ఆ సమయంలో ఆ ముక్కలంటున్న కమల సరిగ్గా అతని అత్తగారిలాగే అవుపించింది. అతని అత్తగారే అలా అడుగుతున్నట్టువుంది...ఆనాడు తనుచేసినవన్నీ...జ్ఞాపకానికివచ్చేయి...... అవకాశం వుందికదా అని, వారి చెయ్యి కిందా తన చెయ్యిమీదా అని—వారి అనువు పరిస్థితి, కనిబెట్టి, ఆడపిల్లని యిచ్చుగున్నాక తనేంచేసినా చెల్లుతుందనే గర్వంతో నీ-భార్యని వెనకవేసుకొని ప్రతీదానికి ఒడ్డుతూ, ఒక ఆయుధంలా ఉపయోగించి ఏమయినా అంటే—తను చేయగలిగింది, చేసినా ప్రస్తుతం చెల్లుతున్నది పిల్లని పుట్టినింటికి వేరుచేయడం ఒక్కటేకాబట్టి, పంపను, అంటూ బెదిరించి, భయపెట్టడమూ, అయినదానికీ కానిదానికీ సందర్భశూన్యంగా పేచీలు పెడుతూండడమూ, శక్తికొలదీ పంచిల చాపు పెడితే, తాహతుకి తక్కువ అని సూటు బలవంతాన్ని తీసుకోడం, మరోమారు సైకిలు యిచ్చినట్టయితే గాని తీసుకువెళ్లడానికి వీలు లేదనడం, యింకోసారి అర్జంటుగా అయిదువందలు కావాలని తీసుకొని ఎగనామం పెట్టడం, ఒకసారి మాట మీద మాటరాగా, పిల్లని తను పంపకపోయినా, చీరలు కొని పంపుతే తిరిగి పార్సిలుచేసి పంపెయ్యడం, ప్రతిసారి వెళ్లినపుడూ 'ఫలానాయింత' అని అచ్చివున్నట్టు, దాచపెట్టినట్టు అడిగి, గుంజి, డబ్బు తీసుకుంటూండడం......యీ విధంగా చింతించే మనసుల్ని విచారించకుండా క్షోభపెట్టినరోజులు జ్ఞాపకానికివచ్చి చంద్రం అలా వుండిపోగా—

కమల చేతిలోంచి పార్సిలు తీసుకుంటున్నపుడు తెలివివచ్చింది.

"అవును తగినపనేచేశాడు" అన్నాడు.

అది విని కమల పూరంత నవ్వింది...

"ఏం మీరెంచేతి చెప్పలేదు!" అని అడిగింది.

నువ్వు చెప్పేవనుకున్నా. నువ్వూ చెప్పలేదా?"

"అతను చూస్తుండగానే బెడ్డింగులో పెట్టేను వేరే చెప్పేదేముంది?"

చంద్రం కొంతవరకూ పశ్చాత్తాప పడ్డా

అహం వదలలేదు, కోపం లోపలవుంది.

"అతనికిస్తామని తెలీదా! అంత యిష్టం లేకపోతే యిక్కడే వదిలేయరాదూ? మళ్లీ యీ డొంక తిరుగుడంతా ఎందుకు. వేరే బొట్టుపెట్టి చిత్తగించు అని చెప్పాలా! ఒకడిని చిన్న బుచ్చితేగాని వేరొకడికి గౌరవం, ఆధిక్యతా రాదు, అక్కడికిగాని అతగాడి గౌరవం నిలబడదు కాబోలు!" అని గబగబా అనేసేను.

"భూమి గుండ్రంగా వుందని చెప్పడానికి, తలనొప్పి అయినా తనదాకా వస్తేగాని తెలియదని చెప్పడానికిన్ని యీలా చేశాడు...అందికే అన్నారు అత్తా ఒకింటి కోడలే అని. మీ రివన్ని ఆలోచించే అప్పుడు విడిపించారా?" అంది కమల.

"నువ్వయినా వుంచు నా మర్యాద! అసలు నువ్వు చెప్పి యివ్వకపోవడం నీది తప్పు!"

"బావుంది, ఏదివచ్చినా నామీద తోసేస్తారు! అమ్మాయితో చెప్పేను..."

అని కమల అంటూండగానే 'గౌరి' అక్కడికి వచ్చి—

"బావుంది నాన్నా... నువ్వే చెప్పు! యిచ్చేవారు మీరు, పుచ్చుకొనేవారు తను! మధ్య నే చెప్పడం ఏమిటి? నా పెత్తనం ఏమిటి? అలా అయితే యీ సామానంతా తీసుకోమని చెబుతాను! తీసుగోనిస్తారా? అయినా అతనితో నువ్వు మాటాడవా? అమ్మ మాటాడదా? అతని సంగతి మీకు తెలుసు! అందికే ఆయన తిరిగి తోలేశారు! యిందులో ఆయన తప్పేముంది?

అదిగాక నే చెప్పినంతమాత్రంలో తీసుగుంటే ఆ తర్వాత 'మేం చెప్పకండా తీసుకుపోయాడు ఏదయినా యింతేకదా?' అని మీరంటే! అంచేతే ఎవరి జాగ్రత్తలో వారుండాలి!" అని గబగబా సమయం చూసుకొని తగినట్టు సమాధానం చెప్పేసింది.

అవన్నీ విని కమల మొఖం చంద్రం, చంద్రం మొహం కమలా చూసుకొని వుండిపోయేరు తప్పిస్తే జవాబు చెప్పలేకపోయేరు!

కన్నకూతురయినా గౌరి ఆమె భర్తనే వెనకేసుకొచ్చి వాదించడం చూసి చంద్రం ఆశ్చర్యపోతూను... "యీ ఆడవాళ్ళలో ఎంతమార్పువస్తుంది!" అనుకున్నాడు.

అలా అంటున్న అమ్మాయి గౌరిని చూస్తూంటే తన చిన్నప్పుడు, తనది తప్పున్నా తన వంతు వాదించిన కమలే గౌరిలో చంద్రానికి కనిపించింది. గౌరి వెళ్లిపోయింది."

"చేసినతప్పులు దిద్దుకోండి" అంటూ మళ్ళీ ఒక్కలాగా నవ్వడం మొదలెట్టింది కమల, ఆ నవ్వు ఆగడం లేదు.....

కాని చంద్రానికిమాత్రం ఏకోశాన్నా తెచ్చుకుందామన్నా నవ్వు రాలేదు...

ఒకప్పుడు గౌరిని చేతికిస్తూ 'నాగవల్లి' అని నవ్వించిన కమలతో సహా చంద్రం కూడా నవ్వేడు...కాని...

ఇప్పుడు..."అల్లుని అలకో సమయంవచ్చినప్పుడుమాత్రం అలకతీర్చడం, అలిగినంతలేక కాదని అనుభవపూర్వకంగా తెలుకోవడంవల్ల కమల నవ్వినా, నవ్వించినా, చంద్రం నవ్వలేక పోయేడు... ★




సంవత్సరంపొడుగూ
ఆమె కుటుంబానికి
'ఓవల్‌టిన్ యిస్తుంది'

"ఓవల్‌టిన్"లో ఆరోగ్యం, బలము విలసిల్లే అమూల్యమైన గుణాలుండడంవల్ల తెలివిగల గృహిణి తన కుటుంబానికి సంవత్సరం పొడుగునా "ఓవల్‌టిన్" ఇస్తుంది.

"ఓవల్‌టిన్" ఎల్లప్పుడూ సేవింపదగిందే చలిగా వున్నప్పుడు ఒక కప్ వేడి "ఓవల్‌టిన్" కంటె ఉత్తమమైనది ఇంకోటిలేదు, ఎండాకాలంలో అది ఉత్తమమైన శీతలపానీయంగా ఉపకరిస్తుంది. అది మెదడుకు, శరీరానికి పుష్టినిచ్చి హాయిగా నిద్రపట్టించును. "ఓవల్‌టిన్" ప్రకృతి సిద్ధమైన ఉత్తమ ఆహారములతో తయారుచేయబడింది. ఇంకను దీనిలో అదనంగా బి. డి విటమినులు చేర్చబడ్డాయి మీ స్టోరునుంచి ఆర్డరు చేయండి. అయితే అపబారకం "ఓవల్‌టిన్" మాత్రమే వాడండి.

డిస్ట్రిబ్యూటర్లు: గ్రాహమ్సు ట్రేడింగు కంపెనీ (ఇండియా) లిమిటెడ్.



# ఓవల్‌టిన్

చల్లగాగాని వేడిగాగాని త్రాగవచ్చును

"ఓవల్‌టిన్" అమెచూర్ కార్యక్రమం సిలోన్ రేడియోలో శనివారాలు రా 8 మంది 8-30 గం॥ల వరకు వినండి. (హిందీ-41.72 మీటర్లు)

IV. 445